'విశ్వకర్మ యోజన'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ×విశ్వకర్మ యోజన€ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన లబ్ధిదారులకు వివరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గం కోర్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతుల వారిలో ×విశ్వకర్మ యోజన€ పథకం వర్తించే వారికి ఈ పథకం గురించి పూర్తిగా వివరించి ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. నియోజకవర్గంలో చాలామంది బీసీలు ఉన్నారని, ఆ విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్క బీసీ ఇంటికెళ్లి ఈ పథకాన్ని వివరించాలని కోరారు. పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ.. ఓబీసీలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు ఈ విశ్వకర్మ యోజన పథకం కీలక మైలురాయిగా మారుతుందన్నారు. పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, నేతలు కృష్ణయాదవ్, పాపారావు, శ్యామ్‌రాజ్, కన్నె ఉమా రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగవాడీలకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

కాచిగూడ: ఐసీడీఎస్‌తో గత 48 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలుగా పనిచేస్తున్న తమకు ఇప్పటి వరకు ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిని అంగన్‌వాడీ టీచర్లు శివరాణి, చంద్రకళ, అన్నపూర్ణ, శ్రీదేవి, జ్యోతి, మాధవి తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యూటీ ఇప్పించాలన్నారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సామాజిక భవనం ప్రారంభం


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి రాజీ లేకుండా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అభివృద్ధి పనులను ప్రారంభించారు. బతుకమ్మ కుంటలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.75 లక్షలతో నిర్మించనున్న తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, గెల్వయ్య, శ్రీరాములుముదిరాజ్, చంద్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రజక సంక్షేమ కమిటీ సభ్యుడిగా మురళి


నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: హైదరాబాద్ జిల్లా రజక సంక్షేమ కమిటి సభ్యుడిగా ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముదిగొండ మురళి నియమితులయ్యారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దూరిశెట్టి నియామక ఉత్తర్వులు జారీ చేయగా.. ఆదివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్, బీసీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆశన్న, కన్వీనర్‌గా వివిధ శాఖల అధికారులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. రజక సంఘం ప్రతినిధులు అనాధికార సభ్యులుగా ఉంటారని రజకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై, దోభీఘాట్‌ల నిర్మాణం, సబ్సిడీతో కూడిన రుణాలు, లాండరీ షాపులకు రూ.250 ఉచిత కరెంటు తదితర సమస్యలపై ఈ కమిటీ పని చేస్తుందన్నారు. బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్, జనార్ధన్, శ్రీనివాస్, మధు, కళ్యాణ్‌నాయక్, జనార్దన్, గౌతమ్, సాయి, మున్నానాయక్, పొన్నాల ప్రవీణ్, బొడ్డుపల్లి మల్లికార్జున్, వెంకటయ్య, వెంకటేష్ తదితరులున్నారు.

క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర ఉపకోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి



అంబర్‌పేట్: బీజేపీ రాష్ట్ర ఉపకోశాధికారిగా బాగ్ అంబర్‌పేట్‌కు చెందిన డాక్టర్ ఓ. శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆయన నియమాకాన్ని ఖారారు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానన్నారు. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


ఆలయ పునర్నిర్మాణ పూజలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట్: నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తనవంతు చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట బతుకమ్మకుంటలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చేపట్టిన భూమిపూజ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు చేయూతను అందిస్తున్నానన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

మాజీమంత్రి కృష్ణయాదవ్‌కు సన్మానం



నల్లకుంట: ఇటీవల బీజేపీలో చేరిన మాజీమంత్రి కృష్ణయాదవ్‌ను పలువురు బీజేపీ నాయకులు సన్మానించారు. ఆదివారం బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే.బాబు, సెంట్రల్ జిల్లా ఎస్సీమోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్‌కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు మహేష్, ఎస్సీ మోర్చా అంబర్‌పేట కన్వీనర్ మంగి శివకుమార్ తదితరులు కృష్ణాయాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

కాచిగూడ: మన హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం కాచిగూడలోని సుస్వాగత్ హోటల్‌లో దసరా కార్నివాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగువారి పండుగల ప్రాముఖ్యతను పిల్లలు, నేటి యువతకు తెలియజేయాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధిని పొందడానికి ఆర్థిక సమృద్ధిని సాధించడానికి కార్నివాల్ దోహదపడుతుందన్నారు. బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, నిర్వాహకులు వెంకటరమణ, మహేశ్వరి, షణ్ముఖ తదితరులున్నారు.

తెలంగాణ భజరంగ్ సేన నూతన కమిటీ

కాచిగూడ: తెలంగాణ భజరంగ్ సేన నూతన కమిటీల ప్రతినిధులను కాచిగూడలోని భజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్. లక్ష్మణ్‌రావు ఆదివారం నియమించారు. భజరంగ్ సేన మహిళా మోర్చా రాష్ట్ర సలహాదారుగా కాజల్ కుష్వా, గ్రేటర్ అధ్యక్షురాలిగా స్రవంతి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధ్యక్షుడిగా రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సునీల్ అగర్వాల్, గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా పవన్‌నాయుడు, ముషీరాబాద్ అధ్యక్షుడిగా రాఘవకుమార్‌కు ఆయన నియామకపత్రాలను అందజేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రజని తదితరులున్నారు.

నియామకం

నల్లకుంట: ఇండియన్ కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ (ఐసీడబ్ల్యూసీ) మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా అమీనా బేగం, ఉపాధ్యక్షురాలిగా కళ్యాణి నియమితులయ్యారు. వెల్ఫేర్ సొసైటీ జాతీయ అధికార ప్రతినిధి ఐజాక్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంటలోని కౌన్సిల్ కార్యాలయంలో రాష్ట్ర వినియోగదారుల చైతన్య సదస్సు జరిగింది. దీనికి హాజరైన ఐసీడబ్ల్యూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు మహిళా విభాగం ప్రతినిధులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా విభాగం ప్రతినిధులు మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులపై రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం జరగడం లేదు


సమావేశంలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో భూ నిర్వాసితులకు సరైన న్యాయం జరగడం లేదని తెలంగాణ మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య అన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం బాలగోపాల్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల ఫోరం ఆధ్వర్యంలో పౌర హక్కుల నేత బాలగోపాల్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో నిర్వాసితుల సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల వేదిక సమన్వయకర్త ఏ.చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా వాకాపల్లి నేరము శిక్ష, పాసిజం అండ్ క్యాస్ట్ అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. చివరగా బాలగోపాల్‌పై తీసిన డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఎస్.జీవన్‌కుమార్, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఖాంకాన్ సువాన్ హౌజింగ్, స్త్రీ హక్కుల కార్యకర్త కత్తి పద్మ, సీనియర్ జర్నలిస్టు ప్రతీక్‌జన్నా, ప్రొఫెసర్ హరగోపాల్, విమలక్క, సంధ్య తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల హామీని వివరించేందుకు శనివారం రాత్రి సికింద్రాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు చౌరస్తా నుంచి రాంనగర్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాంనగర్ చౌరస్తాలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. 'కాంగ్రెస్‌ను గెలిపించండి ఆరు గ్యారెంటీ పథకాలను అందుకోండి' అనే నినాదంతో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజీద్‌హుస్సేన్, సీనియర్ కాంగ్రెస్ నేతలు గుర్రం శంకర్, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, పట్నం నాగభూషణంగౌడ్, మేడి సురేష్, లింగంగుప్తా, ఏ,బి-బ్లాక్‌ల అధ్యక్షులు వి.డి.కృష్ణ, అంజియాదవ్, జోహెర్ హుస్సేన్, అభిషేక్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లోకి పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నల్లకుంట డివిజన్ బీజేపీ నాయకురాలు లక్ష్మి తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహిళలకు గులాబి కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, తాను నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులవుతున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు.

ముఠా జైసింహ ఆధ్వర్యంలో..

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు యువత ముందుకు వస్తున్నారని బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ అన్నారు. ఆదివారం అడిక్‌మెట్ డివిజన్ పార్టీ కార్యాలయంలో పలువురు ముస్లిం, మైనార్టీలు మహ్మద్ అఫ్రోజ్, మహ్మద్ అబ్రార్, మహ్మద్ మక్దుమ్, మహ్మద్ మూషాషరీఫ్ తదితరుల ఆధ్వర్యంలో పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, అబ్బు, గోపి తదితరులున్నారు.

సన్మానం


సన్మానిస్తున్న మహేంద్ర సంఘం సభ్యులు

ముషీరాబాద్: మోస్ట్ బ్యాక్‌వాడ్ క్యాస్ట్ (ఎంబీసీ) చైర్మన్‌గా ఇటీవల నియమితులైన నందికంటి శ్రీధర్‌ను నియోజకవర్గ జంట నగరాల మహేంద్ర సంఘం కోశాధికారి రేశం మల్లేష్ ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. మేదరులకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. పిల్లి రాంకుమార్, కోన నర్సింగ్‌రావు, రామకృష్ణ, వేణుగోపాల్, రాజ్‌గోపాల్ తదితరులున్నారు.

పసుపుబోర్డు ఏర్పాటు హర్షణీయం


ఇందిరాపార్కు చౌరస్తాలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుని కేంద్ర కేబినెట్‌లో ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతగా ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నేతలు పాలాభిషేకం చేశారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. రమేష్‌రాం ఆధ్వర్యంలో ఇందిరా పార్కు చౌరస్తాలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రమేష్‌రాంతో పాటు కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, పీఎస్ చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో పసుపుబోర్డును ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో కేంద్రప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో తన వంతు సహాయ, సహకారాలు అందిస్తోందన్నారు. బీజేపీ నాయకులు గంటా శ్రీనివాస్, మీసాల విఠల్‌రావు, పరుశురాం, చంద్రమోహన్, ఆంజనేయులు, కుమార్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చిక్కడపల్లి: చిక్కడపల్లి బ్రిడ్జి వద్ద హుస్సేన్‌సాగర్ నాలా ఒడ్డుకు ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకురావడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం నాలాలో కొట్టుకువచ్చినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు 45 నుంచి 50 ఏళ్ల ఉండొచ్చని ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్, ఎస్సై నాగరాజు తెలిపారు. వారు డీఆర్ఎస్ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. సంబంధీకులెవరైనా చిక్కడపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని కూలీ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని కూలీ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఫారూఖ్‌నగర్‌కు చెందిన కూలీ సయ్యద్ హమీద్ (58) ఆదివారం ఫలక్‌నుమా - బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అమలుకాని హామీలిచ్చే పార్టీలను నమ్మొద్దు


మహిళా నేతలతో బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ


క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ ముఠా జైసింహ

ముషీరాబాద్: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆచరణలో అమలు కాని హామీలను ఇస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీ నేతల మాయమాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకులు ముఠా జైసింహ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో డివిజన్ మహిళా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ.. గ్యాస్ ధరలను విపరీతంగా పెంచిన బీజేపీ అగ్రనేతల మాటలను, గ్యాస్ ధరలను తగ్గిస్తామని ప్రకటిస్తున్న కాంగ్రెస్ నేతల మాటలను నమ్మొద్దన్నారు. వారు పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో ప్రజలు పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని ఆయా ప్రభుత్వాలు రాష్ట్రంలో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను మభ్యపెట్టే మాటలను మాట్లాడుతున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పాలన ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. భోలక్‌పూర్ డివిజన్ మహిళా కమిటీ నాయకులు జ్యోతి, మాధవి, అరుణ్ తదితరులున్నారు.

క్రీడల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చిక్కడపల్లి: క్రీడల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని బీఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ అన్నారు. టీం జైయువసేన జైసింహ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని టీఆర్టీ వార్డు కార్యాలయం ఆవరణలో ఆయన తన సొంత నిధులతో 20టీమ్‌లకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని, నియోజకవర్గంలో తాను నిరంతరం శ్రమిస్తానన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, నాయకులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ఆకుల శ్రీనివాస్, సాయిచాణక్యరెడ్డి, రవిశంకర్‌గుప్తా, ముఠాశివసింహ, రాజ్‌కుమార్, గౌస్, ఎస్ట్రీమ్, వల్లాల శ్రీనివాస్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య హాస్టల్ నూతన కమిటీ

కాచిగూడ: వైశ్య హాస్టల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాచిగూడలోని వైశ్య హాస్టల్ ఆడిటోరియంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో హాస్టల్ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా పబ్బతి రవిప్రసన్నకుమార్, కోశాధికారిగా పొద్దుటూరి రాజేశ్వర్‌రావులు ఎన్నికయ్యారు. 2023-25 ఏళ్లకు ఈ కమిటీని ఎన్నుకోగా.. నూతనంగా ఎన్నికైన కమిటీని అభినందించి ఘనంగా సత్కరించారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు కార్యదర్శి విశ్వనాథం నగేష్, కోశాధికారి కూర రఘువీర్, ట్రస్టీలు చంద్రయ్య, కొత్తూరు జయప్రకాష్, వేలూరు రవీంద్రనాథ్ గుప్తా, మల్లికార్జున్, కూర జయరాములు గుప్తా, చల్లా ప్రసన్న, మధు, చికట్‌మల్ల అశోక్‌కుమార్, నాగమల్ల శ్రావణ్‌కుమార్, వేలూరు శైలేంద్రనాథ్ గుప్తా తదితరులున్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: ఆటో, క్యాబ్ మీటర్ చార్జీలను 10 రోజుల్లో పెంచాలని తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు బైరగోని రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన చలో ఇందిరాపార్క్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డ్రైవర్ల హక్కుల సాధనకై ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. ఆటో, క్యాబ్ మీటర్ చార్జీలను పెంచకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. అర్హత కలిగిన ప్రతి డ్రైవర్ కుటుంబానికి డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దూసరి రాజుగౌడ్, సురేందర్‌రెడ్డి, రవిగౌడ్, మహేష్‌ముదిరాజ్, నరసింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభివృద్ధికి పాశ్వాన్ కృషి


నివాళులర్పిస్తున్న ఇనుగాల బీమారావు

కాచిగూడ: అట్టడుగు వర్గాల అభివృద్ధికి లోక్‌జనశక్తి పార్టీ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ రామ్‌విలాస్ పాశ్వాన్ చేసిన కృషి ఎనలేనిదని రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగాల భీమారావు అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాంవిలాస్ వర్ధంతిని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో రాంవిలాస్ పాశ్వాన్ పాత్ర గొప్పదని కొనియాడారు. త్వరలోనే రాష్ట్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటికే 27 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, కేంద్రంలో తమ పార్టీ భాగస్వామ్యంగా ఉన్నందున పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో నడుచుకుంటామన్నారు. బీజేపీతో అలయన్స్‌లో తమ పార్టీకి 10 టికెట్లు కేటాయించాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వేయకపోవడం దురదృష్టకరమన్నారు. పార్టీ నేతలు పెండ్యాల నర్సింగ్‌రావు, బోయిని శ్రీనివాస్, అభిరామ్, మెడిశెట్టి వెంకటేశ్వర్‌రావు, మేకల విజయలక్ష్మి, భానుమూర్తి, కృపప్రసాద్ తదితరులున్నారు.

కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం


గ్రేడింగ్ బెల్ట్‌ను అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ బురహాన్ అలీ

కాచిగూడ: కరాటే సాధన వల్ల క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలంగాణ రాష్ట్ర మహిళ భద్రతా విభాగం అడిషనల్ ఎస్పీ బురహాన్ అలీ అన్నారు. ఆదివారం కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బెల్ట్ గ్రేడింగ్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించి వారికి బెల్ట్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. కరాటే నేర్చుకోవడానికి వయస్సుతో సంబంధం లేకుండా అందరూ నేర్చుకోవచ్చని ఆయన సూచించారు. జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, బ్లాక్‌బెల్ట్‌లు కరీం, అమృతరెడ్డి, యోగిని, గణ సంతోషిని, గౌతమ్, షైనీ, నందిని తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్ రచనశ్రీ

ముషీరాబాద్: రాష్ట్రంలో నిరుపేదలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హరియాణా గవర్నర్ కుమార్తె బండారు విజయలక్ష్మి కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ ప్రజలకు సూచించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకులు భువనగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆయూష్మాన్ భారత్ కార్డుల నమోదు కార్యక్రమం కవాడిగూడ బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించగా.. వారు హాజరై నిరుపేదలకు కార్డులను అందజేశారు. ప్రతి నెట్‌వర్క్ హాస్పిటల్‌లో రూ.5లక్షల విలువ చేసే వైద్యం పొందేందుకు ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు శేఖర్, వెంకటేష్, పరిమళ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, బస్తీ వాసులు కనకయ్య, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'జాషువా సాహిత్యం.. దళితుల ఆవేదన'

చిక్కడపల్లి: జాషువా సాహిత్యం దళిత జనుల ఆక్రోశం ఆవేదనల సహితం అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. దీనికి గొప్ప ఉదాహరణ ఆయన రచించిన 'గబ్బిలం' కావ్యమని పేర్కొన్నారు. త్యాగరాయ గానసభలో కళాసుబ్బారావు కళావేదికలో ఆదివారం శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా గుర్రం జాషువా సంస్మరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాషువా రాసిన శిశువు కావ్యం తెలుగు సాహిత్యంలో అత్యుత్తమమైనదిగా గుర్తింపు పొందిందన్నారు. గానసభ సంప్రదాయ వాదైన విశ్వనాథ సత్యనారాయణతో పాటు దళిత ఉద్యమ కవైన జాషువాను కూడా స్మరిస్తూ సమావేశాలు నిర్వహించడం అభినందించాల్సిన విషయమన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై వేమరాజు విజయ్‌కుమార్, నీలా శ్రీధర్, కథక్ అంజిబాబు పాల్గొన్నారు.